క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొల్లిపర: మండలంలోని అత్తోట పీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు నిమిత్తం శనివారం విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు ఏఈ ప్రదీప్ కుమార్ తెలిపారు.శుక్రవారం మండల కేంద్రం కొల్లిప సబ్‌స్టేషన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో చివలూరు, శిరిపురం, కుంచవరం, దంతలూరు, అత్తోట, కమటవారిపాలెం ఆయా గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదని తెలియజేశారు.

తెనాలిటౌన్: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా పట్టణంలోని అమరావతి ప్లాట్స్, రూరల్ మండలం గ్రామాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి. అశోక్‌కుమార్ శుక్రవారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు, అధికారులకు సహకరించాలని కోరారు.

మేనిఫెస్టోలలో సినీపరిశ్రమ అభివృద్ధి ఏది?

సినీ దర్శకుడు దిలీప్ రాజా

తెనాలిరూరల్: ఎన్నికల మేనిఫెస్టోలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సినీపరిశ్రమ అభివృద్ధి అంశం ఏ రాజకీయ పార్టీ అమలు చేస్తామని చెప్పారని ' మా – ఏపీ' వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్ రాజా ప్రశ్నించారు. స్థానిక మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎవరైతే ఆంధ్రలో సినీ పరిశ్రమ అభివృద్ధికి చిత్తశుద్ధితో తమ ఎన్నికల మేనిఫెస్టోలో పెడతారో వారికే ఆంధ్రలో నివసించే కళాకారులు, సాంకేతిక నిపుణులు ఓటు వేయాల్సిందిగా ఆయన పిలుపునిచ్చారు. రాజకీయ పార్టీలు ఈమేరకు తగిన కృషి చేయాల్సిందిగా ఆయన కోరారు. విజయవాడ భవానీ ద్వీపం, విశాఖలో స్టూడియోలుకు కేటాయించిన భూములలో షూటింగుల నిమిత్తం అవసరమైన ఫ్లోర్లు ప్రభుత్వం నిర్మిస్తే అందుకుతగిన రెవెన్యూ కూడా ప్రభుత్వానికి వస్తుందని దిలీప్ రాజా అభిప్రాయం వ్యక్తం చేశారు. సమావేశంలో నటుడు మిలటరీ ప్రసాద్ పాల్గొన్నారు.

కంచర్లపాలెంలో బీజేపీ పల్లెకు పోదాం



తెనాలిటౌన్: రూరల్ మండలం కంచర్లపాలెం గ్రామంలో బీజేపీ నాయకులు శుక్రవారం 'పల్లెకు పోదాం' కార్యక్రమాన్ని ప్రారంభించారు. బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు తోటకూర కోటేశ్వరరావు గ్రామంలో పర్యటించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన పథకాలు అమలు చేస్తున్న పథకాలు గురించి ప్రజలకు వివరించారు. పథకాల్లో భాగంగా ప్రజ్వల గ్యాస్ కనెక్షన్ ద్వారా అనూష అనే మహిళకు వచ్చిన గ్యాస్ సిలెండర్‌ను అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కాలిశెట్టి రమేష్, మహిళలు కుసుకుర్తి అనూష, ఇందిర, లలిత, ఎలీసమ్మ, సింధు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



తెనాలిఅర్బన్: శ్రీ కాళికామాత దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో శివాజీచౌక్‌లోని దేవస్థానం వద్ద శుక్రవారం పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్ష కార్యదర్శులు గుమ్మడి రమేష్, వై.శ్రీనివాసరావులు మాట్లాడుతూ ప్రతినెలా రెండవ శుక్రవారం దేవస్థానం వద్ద అన్నదానం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కందెపి సీతారామయ్య, నీరంజన్, సుబ్బారావు, అడపాల శ్రీనివాసరావు, పి.రామకృష్ణ, సిహెచ్. హనుమంత్, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం

- ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సిగ్నల్స్ ఏర్పాటు
- పనులు పూర్తి చేసిన యంత్రాంగం
- నేడు ప్రారంభించనున్న ఎమ్మెల్యే

తెనాలిరూరల్: పశ్చిమ డెల్టాలో ప్రధానమైన పట్టణం తెనాలి. దీంతో పరిసర గ్రామాల నుంచి ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. అయితే రోజు రోజుకీ పెరుగుతున్న వాహనాలతో ట్రాఫిక్ కష్టాలు అంతకంతకూ పెరుగుతూనే ఉన్నాయి. ఈ కారణంగా పట్టణంలో రద్దీ ఎక్కువగా ఉంటోంది. సుమారు మూడు దశాబ్దాల క్రితం పట్టణంలో తెనాలి చందోలు రహదారి, బోస్ రోడ్డు, గాంధీచౌక్ కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఉండేవి. అప్పటి జనాభా వాహన రద్దీకి తగ్గట్టు పనిచేసేవి. కొన్ని సాంకేతిక కారణాలతో వాటిని తొలగించాల్సి వచ్చింది. సుమారు దశాబ్దం క్రితం మార్కెట్ వంతెన వద్ద స్కైవాక్ బ్రిడ్జి నిర్మాణం కోసం అధికారులు మూడు రోజులు పాటు చేపట్టిన సర్వేలో మార్కెట్ వంతెన వద్ద తెనాలి–గుంటూరు రోడ్డు, తెనాలి–చందోలు రహదారిలో గంటకు 1400 నుంచి 1600 మంది పాదచారులు రాకపోకలు సాగిస్తున్నారని తేలింది. ఇక వాహనదారుల సంగతి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇక్కడి మెయిన్ రోడ్డు, బోస్ రోడ్డు, పాత సత్యనారాయణ టాకీస్ రోడ్డు, నెహ్రూ రోడ్డు, ఆంధ్రా బ్రిడ్జి నుంచి గంగానమ్మ పేటకు వెళ్లే రోడ్డు, ఓవర్ బ్రిడ్జి డౌన్ ఎప్పుడూ వాహనాల రద్దీతో ఉంటుంది.

పెరుగుతున్న జనాభా, వాహనాల వినియోగానికి తగ్గట్టు రోడ్ల విస్తరణ జరుగక పోవడంతో ట్రాఫిక్ సమస్యలు తప్పడం లేదు. వాహన రాకపోకలను క్రమబద్ధీకరిస్తూ ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయడం ద్వారా కొంత మేర రద్దీని నియంత్రించవచ్చని అధికారులు భావించారు. ఇందుకు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆలోచన తోడైంది. పోలీస్, మున్సిపల్ అధికారులతో కలసి పట్టణంలో పర్యటించిన ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాల్సిన ప్రాంతాలను గుర్తించారు. పట్టణ చెంచుపేటలోని ఉమేష్‌చంద్ర విగ్రహం వద్ద, కొత్త వంతెన, మార్కెట్ వంతెన, కబేళా వంతెన, సాయిబాబా గుడి వద్ద, గాంధీచౌక్ సమీపంలోని పాత అశోక్ పెన్ వర్క్స్ సెంటరు, పాత ప్రభుత్వ వైద్యశాల వద్ద, పాత వీనస్ థియేటర్ సెంటరులో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పనులన్నీ పూర్తయ్యాయి. శనివారం ఉదయం ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థను ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, దాతలు ప్రారంభించనున్నారు.



కొత్త వంతెన వద్ద ఏర్పాటు చేసిన సిగ్నల్స్



మార్కెట్ వంతెన వద్ద సిగ్నల్ లైట్లు

15 ఏళ్ల క్రితమే కమిటీలో తీర్మానం

సబ్‌కలెక్టర్ /ఆర్డీవో అధ్యక్షతన సుమారు 15 ఏళ్ల క్రితమే ట్రాఫిక్ అడ్వయిజరీ కమిటీ ఏర్పాటు చేశారు. మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, పట్టణ సీఐ, టౌన్ ప్లానింగ్ అధికారి, ఆర్టీసీ డీఎం, ట్రాఫిక్ ఎస్ఐ, ఇరిగేషన్, పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ డీఈలు, మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ సభ్యులుగా తీర్మానించారు. వీరి సమావేశాల్లోనూ పట్టణంలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కాగా పాలకులు పట్టించుకోకపోవడంతో ఆ నిర్ణయం అమలుకు నోచుకోలేదు. ప్రస్తుతం ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చొరవతో సిగ్నలింగ్ వ్యవస్థ అందుబాటులోకి వచ్చింది. ఇందుకు కాంటినెంటల్ కాఫీ ఫ్యాక్టరీ అధినేత చల్లా రాజేంద్రప్రసాద్ ఆర్థిక సహకారం అందించారు.

ట్రాఫిక్ నియంత్రణకు సిగ్నల్స్ కీలకం



పట్టణాలు, నగరాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సిగ్నలింగ్ వ్యవస్థ ఎంతో కీలకం. సిగ్నల్ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలనూ నివారించవచ్చు. వాహన రాకపోకలను నియంత్రించడం ద్వారా ట్రాఫిక్ ఇబ్బందులు తొలగుతాయి. ప్రజలందరూ సిగ్నల్‌ను పాటిస్తూ పోలీసులకు సహకరించాలి.

– బి. జనార్ధనరావు, డీఎస్పీ

వంతెనల నిర్మాణం చేపట్టాలి



పట్టణంలో రోజురోజుకీ ట్రాఫిక్ సమస్య పెరిగిపోతోంది. వాహనాల వినియోగం పెరుగుతుండడంతో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉంటోంది. సిగ్నల్స్ ఏర్పాటు చేయడం అభినందనీయం. పట్టణంలో రోడ్ల విస్తరణతో పాటు వంతెనల నిర్మాణం చపట్టాలి. వీలు కాని పక్షంలో వంతెనలను విస్తరించేలా అధికారులు ఆలోచన చేస్తే బాగుంటుంది.

– పొత్తార్లంక చైతన్య, మారీసుపేట

కార్యరూపం దాల్చుతున్నాయి



పట్టణ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చేస్తున్న ఆలోచనలు కార్యరూపం దాల్చుతున్నాయి. భవిష్యత్ తరాల కోసం ఆయన చేస్తున్న ఆలోచనలు నచ్చి కాంటినెంటల్ కాఫీ ఫ్యాక్టరీ అధినేత చల్లా రాజేంద్రప్రసాద్ తమ కంపెనీ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద సిగ్నలింగ్ వ్యవస్థకూ సహకరించారు.

– సునీల్, తెనాలి వేల్ఫర్ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రతినిధి

పేదల వైద్యానికి ప్రభుత్వ ప్రాధాన్యం

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: అనారోగ్యంతో బాధపడుతూ వైద్యఖర్చులను భరించలేని పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతగానో భరోసాను కల్పిస్తోందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. నియోజకవర్గ పరిధిలోని ముగ్గురికి వైద్యఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి వచ్చిన రూ.4.30 లక్షలను చెక్కులను శుక్రవారం వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. చెక్కులు అందుకున్న వారిలో తెనాలి, సంగంజాగర్లమూడి, వల్లభాపురం గ్రామాలకు చెందినవారున్నారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 196 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.1.57 కోట్లను అందజేసినట్టు ఎమ్మెల్యే శివకుమార్ గుర్తుచేశారు. ప్రభుత్వం విద్య, వైద్యానికి, సంక్షేమ పథకాలను ప్రథమ ప్రాధాన్యతను ఇస్తోందని చెప్పారు. వైద్య సహాయం లభించక ఏ ఒక్కరూ అవస్థలు పడకూడదని చెబుతూ ఆరోగ్యశ్రీ కింద 3,600 వ్యాధులకు ఉచితంగా చికిత్సలను అందిస్తున్నట్లు చెప్పారు.

కొంతకాలం ఆసుపత్రిలో ఉన్నవారు డిశ్చార్జి అయినప్పటికీ కొన్నిరోజులు ఖర్చుల నిమిత్తం ఆరోగ్యశ్రీ ఆసరా పేరుతో డబ్బులు ఇచి మరీ పంపుతున్నది ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమేనని చెప్పారు. దేశం మొత్తంలో ఆరోగ్యశ్రీ ఆసరా అందచేస్తున్నదీ కేవలం మన రాష్ట్రంలోనేని స్పష్టంగా చెప్పారు. ఆరోగ్యశ్రీ పరిధిలో లేని వ్యాధుల చికిత్సకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు వివరించారు.

తెనాలి డిపో ప్రథమస్థానంలో ఉండాలి

ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.ఆదాం సాహెబ్



నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆదాం సాహెబ్

తెనాలిఅర్బన్: జోన్ పరిధిలో తెనాలి డిపోన్‌ను ప్రథమస్థానంలో ఉంచే విధంగా ఉద్యోగులందరూ కృషి చేయాలని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.ఆదాం సాహెబ్ సూచించారు. రోడ్డు భద్రతా మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం తెనాలి ఆర్టీసీ డిపోను ఆయన పరిశీలించారు. ఉద్యోగులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులందరూ సమష్టిగా పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని చెప్పారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కండక్టర్లు, డ్రైవర్లకు సహకరించాలని సూచించారు. ట్రాఫిక్ రద్దీ పెరిగిన నేపథ్యంలో డ్రైవర్లు ఒత్తిడికి గురికాకుండా వాహనాలు నడపాలన్నారు. జనవరి నెలలో ఎంపిక చేసిన ఆదర్శ ఉద్యోగులను, ఆయిల్ సేవ్ చేసిన డ్రైవర్లను సన్మానించి నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డీపీటీవో ఎం.రవికాంత్, డీఎం ఎ.రాజశేఖర్, సీఐ ప్రసాద్, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

నందివెలుగులో మహర్షి దయానంద సరస్వతి జయంతి ఉత్సవాలు



ఉత్సవాల్లో ప్రసంగిస్తున్న ఆచార్య హరిప్రసాద్

తెనాలిటౌన్: రూరల్ మండలం నందివెలుగులోని మహర్షి దయానాంద వృద్ధాశ్రమంలో శుక్రవారం మహర్షి దయానంద సరస్వతి ద్విశతాబ్ది ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం యజ్ఞం నిర్వహించారు. ఆర్య ప్రతినిధి సభ(అమెరికా) సంస్థాపచార్య ఆచార్య హరిప్రసాద్ ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. సృష్టికర్త పరమాత్మ నిజనామమైన ఓంకారాన్ని నిత్య ధ్యానించడం మనిషి స్వభావంగా మారాలన్నారు. తద్వారా మానవజన్మ లక్ష్యమైన మోక్షం పొందాలని వివరించారు. వేదధర్మ ప్రచారకులు డాక్టర్ ధర్మతేజ మానవ జన్మ గొప్పతనాన్ని తెలియజేశారు. పరమాత్మ ప్రదత్తమైన వేద జ్ఞానాన్ని గ్రహించి దానిని అనుసరించి జీవిస్తూ వేద రక్షకులు కావాలన్నారు. తొలుతగా మహర్షి దయానంద సరస్వతి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాలను కూరపాటి కల్యాణి రవీంద్రనాథ్, నాగభైరవ గంగాపార్వతి, గుగ్గిలం రారమోహనరావు, వృద్ధాశ్రమ సంఘం కమిటీ సభ్యులు, ఆర్య సమాజం కార్యకర్తలు పాల్గొన్నారు.

రహదారి భద్రత నిబంధనలు పాటించాలి

జిల్లా ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం



ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

తెనాలిరూరల్: వాహనదారులు రహదారి భద్రత నిబంధనలు విధిగా పాటించాలని జిల్లా ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం పేర్కొన్నారు. 35వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం సుల్తానాబాద్ లోని మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో రవాణా శాఖ అధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీటీసీ కరీం మాట్లాడుతూ రహదారి నిబంధనలు పాటించడం వలన ప్రమాదాలను నివారించవచ్చని, వాహన చోదకుల రక్షణ కోసమే నిబంధనలు అమలు చేస్తున్నామని చెప్పారు. నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాల బారిన పడకుండా తమను తాము రక్షించుకోగలరని సూచించారు. ద్విచక్ర వాహన చోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల బారిన పడిన బాధితులను గోల్డెన్ అవర్లో ఆస్పత్రి, ట్రామా కేర్ సెంటర్‌కు తరలించి తక్షణ వైద్య సహాయాన్ని అందించడం ద్వారా ప్రాణాలను రక్షించిన వారవుతారని తెలిపారు. కార్యక్రమంలో ప్రాంతీయ రవాణా అధికారి కె. ప్రసాద్, అధికారులు ఎంవీఐ తోట రాఘవరావు, ఏఎంవీఐ ఎస్‌బీ. మధుసుధనరావు, తెనాలి ఆర్టీసీ డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్, లారి ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బుజ్జి, ఆటోమొబైల్ డీలర్లు, లారీ, ఇతర రవాణా వాహన డ్రైవర్లు పాల్గొన్నారు. అనంతరం రహదారి భద్రత ప్రతిజ్ఞ చేయించారు.

నీటి నిల్వలు లేకుండా చూడండి

తెనాలిఅర్బన్: ఇంటి పరిసరాల్లో, పాత వస్తువుల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలని జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం సూచించారు. మలేరియా విభాగం ఆధ్వర్యంలో చినరావూరులో శుక్రవారం దోమల నియంత్రణ ర్యాలీ నిర్వహించారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని, నీటి నిల్వల వలన దోమల వ్యాప్తి పెరిగి వ్యాధులు ప్రబలుతాయని చెప్పారు. ఎవరికైన జ్వరం సంభవిస్తే వెంటనే వైద్యశాలలో చికిత్స పొందాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి సిహెచ్.ప్రభాకర్‌రెడ్డి, సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, వంగల పున్నారెడ్డి, శివగణేష్, దీపాల శ్రీనివాసరావు, బందారు మల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వేగంగా తెనాలి ట్యాంక్‌బండ్ నిర్మాణ పనులు



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: సుందర తెనాలి రూపకల్పనలో భాగంగా తెనాలికి ముఖద్వారమైన విజయవాడ రోడ్డులో నిజాంపట్నం కాల్వకట్టపై నిర్మిస్తున్న తెనాలి టాంక్ బండ్‌కు వేగంగా అడుగులు పడుతున్నాయి. తెనాలి ఖ్యాతిని తీసుకొచ్చిన మహనీయుల విగ్రహాలతో ఏర్పాటయ్యే ట్యాంక్ బండ్‌కు నిర్మాణ పనులు కొంతకాలంగా జరుగుతున్న విషయం తెలిసిందే. విగ్రహాలకు అవసరమైన దిమ్మెల నిర్మాణం పూర్తయింది. వాటికి గ్రానైట్ రాళ్లను అతికించారు. విగ్రహాలను ఉంచే మొత్తం ప్రదేశంలో ఇప్పుడు ఫ్లోరింగ్ నిర్మాణం చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ శుక్రవారం సాయంత్రం ఈ పనులను పరిశీలించారు. మున్సిపల్ ఇంజినీరు కె.నాగమల్లేశ్వరరావు, కాంట్రాక్టర్లతో మాట్లాడారు. అవసరమైన సూచనలు చేశారు. నిర్ణీత వ్యవధిలోగా పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. పట్టణ ప్రజలకు ఆటవిడుపుగా ఉండేలా ఈ ప్రదేశాన్ని మొత్తం బ్యూటిఫికేషన్ చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఈ పనులను చేపట్టినట్టు చెప్పారు. వీరితో కౌన్సిలర్ పేరం సంజీవరెడ్డి, రాష్ట్ర జలవనరుల కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్ ఉన్నారు.

నేటి నుంచి మహాకుంభాభిషేక మహోత్సవాలు

తెనాలి: పట్టణ రామలింగేశ్వరపేటలోని శ్రీదుర్గాపార్వతీ సమేత శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం నుంచి పుష్కర బ్రహ్మోత్స మహాకుంభాభిషేక మహోత్సవాలను నిర్వహించనున్నారు. మూడురోజులపాటు జరిగే ఉత్సవాల్లో భక్తులు పాల్గొనాలని ఆలయ అధికారులు కోరారు. తొలిరోజున ఉదయం ఏడు గంటల నుంచి ప్రత్యేక పూజలు, హోమాలతో ఉత్సవాలను ప్రారంభిస్తారు. రెండోరోజు వివిధ రకాల హోమాలను జరుపుతారు. చివరిరోజైన 12వ తేదీన ఉదయం 11 గంటలకు శ్రీసచ్చిదానంద సరస్వతీ మహాస్వాముల చేతులమీదుగా మహాకుంభాభిషేకం జరుగుతుంది. అనంతరం అన్నదానం, సాయంత్రం శాంతి కల్యాణం నిర్వహిస్తారు. మూడురోజులు ధార్మిక ఉపన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. శతాధిక ప్రతిష్ఠాపనాచార్య దుర్భాకుల సాంబమూర్తి అవధాని, విష్ణుభట్ల ఆంజనేయ చయనులు పర్యవేక్షిస్తారు. ఆలయ కార్యనిర్వహణాధికారి అవుతు శ్రీనివాసరెడ్డి వివరాలను తెలియజేశారు.

మద్యం విక్రేత అరెస్ట్

అమర్తలూరు(వేమూరు): మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. అమర్తలూరు మండలంలోని యలవర్రు గ్రామానికి చెందిన దాసరి అబ్రహాం మద్యం విక్రయిస్తున్న క్రమంలో ఎస్ఐ నవీన్ కుమార్ దాడులు నిర్వహించి అతనిని అదుపులో తీసుకున్నారు. అతని నుంచి పది మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు.

విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ



దావులూరులో మాత్రలు వేస్తున్న ఎంపీపీ పద్మావతి, డాక్టరు లక్ష్మిసుధ



తెనాలిలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న సుబ్బరాయణం

తెనాలిఅర్బన్: రక్తహీనత నియంత్రణకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం పేర్కొన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా తెనాలి పట్టణ, మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలలు, విద్యాసంస్థలు, అంగన్‌వాడీ స్కూల్స్‌లోని విద్యార్థులకు శుక్రవారం ఆల్బెండజోల్ ట్యాబ్లెట్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 0–19 సంవత్సరాల వయస్సు ఉన్న వారందరూ వీటిని వేసుకోవాలని సూచించారు. వీటిని వేసుకోవడం వలన నులిపురుగులను నియంత్రించవచ్చని చెప్పారు. ఈ నెల 16వ తేదీన మరలా ట్యాబ్లెట్స్ పంపిణీ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి డాక్టర్ మహిత, ఆరోగ్య పరివేక్షకురాలు విజయకుమారి, లక్ష్మి, అసిస్టెంట్ మలేరియా అధికారి సిహెచ్.ప్రభాకర్‌రెడ్డి, సబ్‌యూనిట్ మలేరియా అధికారి ఉమాకాంత్, పున్నారెడ్డి, శివగణేష్, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

కంటికి కనిపించని శత్రువు

కొల్లిపర: పిల్లల కడుపులో కంటికి కనిపించని శత్రువు నులిపురుగు అని, చిన్నారుల కడుపులో పెరిగే ఈ చిన్నపాటి నులి పురుగులు వల్లనే అనారోగ్యాలకు కారణమవుతాయన్నారు. అందువలన పిల్లల తల్లిదండ్రులు ప్రతి మూడు నెలలకు ఒకసారి తప్పని సరిగా వారికి ఆల్బెండజోల్ మాత్ర వేయాలని ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా దావులూరు గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో మున్నంగి ప్రాథమిక వైద్యశాల ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మిసుధ మాట్లాడుతూ ప్రతి తల్లిదండ్రులు రెండు సంత్సరాలు నుంచి 19 సంవత్సరాల లోపు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని సూచించారు. నులిపురుగులు మనిషి పేగులలో చేరి రక్తాన్ని పీల్చి పిప్పిచేసి రక్తహీనతకు గురి చేస్తుందన్నారు. మండలంలో 4652 మంది విద్యార్థులు ఉండగా వీరిలో ఈరోజు 4466 మంది విద్యార్థులకు నులిపురుగులు మాత్రలు వేసి 96 శాతం లక్ష్యానికి చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అంబటి సంధ్యాదేవి, ఉపాధ్యాయులు, ఏఎన్‌ఎంలు, పాల్గొన్నారు.

సస్య రక్షణ పద్ధతులు పాటించాలి



కర్లపాలెం: రబీ సాగులో సస్యరక్షణ చేపట్టాలని బాపట్ల ఏడీఏ ఎ.లక్ష్మి తెలిపారు. నల్లమోతువారిపాలెం రైతు భరోసా కేంద్రంలో జాతీయ ఆహార భద్రతా మిషన్ కార్యక్రమంలో భాగంగా సస్యరక్షణ పద్ధతులపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడీఏ లక్ష్మి మాట్లాడుతూ రబీ పంటలు మినుము, పెసర, మిర్చి పైర్లకు ఆశించే తెగుళ్ల నివారణకు అవసరం మేరకే పురుగు మందులు పిచికారీ చేయాలని సూచించారు. ఎంపీటీసీ సభ్యుడు తాండ్ర సాంబశివరావు మాట్లాడుతూ రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటించి, తక్కువ ఖర్చుతో నాణ్యమైన పంటలు పండించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ సుమంత్‌కుమార్, వ్యవసాయ సహాయకురాలు నవ్యశ్రీ, రైతులు తదితరులు ఉన్నారు.

16వ వార్డులో మున్సిపల్ చైర్మన్ పర్యటన

తెనాలిఅర్బన్: వార్డు పర్యటనల సమయంలో ప్రజలు తమ సమస్యలను తెలియజేస్తే వాటిని పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. 16వ వార్డులో శుక్రవారం ఉదయం ఆమె పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అలాగే మురుగు కాల్వల పనితీరును పరిశీలించారు. ఆమె వెంట కౌన్సిలర్లు దివి అనిత, తోట రఘురామ్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హెలెన్ నిర్మల, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు, ఆర్ఐ కుర్రా శ్రీను, ఏఈ చైతన్య, కాళిదాసు, విజయ సత్యం, కె.రవిశంకర్, ఎ.మరియదాసు, తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయండి

తెనాలిఅర్బన్: పేదల సొంతింటి కలను సాకారం చేసే కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇళ్ళ పట్టాలను వారి పేరిట రిజిస్ట్రేషన్ చేయించడం అభినందనీయమని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయలలో జరుగుతున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియను శుక్రవారం ఆమె పరిశీలించి పలు సూచనలు చేశారు. లబ్ధిదారులు ఎక్కువ సమయం వేచి ఉండకుండా పంపించాలని సూచించారు. సాధ్యమైనంత ఎక్కువ మందికి రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. ఆమె వెంట పలువురు మున్సిపల్ అధికారులు ఉన్నారు.



మురుగుకాల్వలను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రాధిక

వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి

ఆర్డీవో హెలా షారోన్

రేపల్లె రూరల్: ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం సిబ్బంది నిత్యం తమ కార్యాలయ పరిధిలోని ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆర్డీఓ హెలా షారోన్ ఆదేశించారు. సచివాలయాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల, ఆరోగ్య కేంద్రాల తనిఖీలో భాగంగా బేతపూడి పంచాయతీలోని ప్రాథమిక ఉప ఆరోగ్య కేంద్రం, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం ఆమె సందర్శించారు. సమస్యలపై వచ్చే ప్రజలకు ఆరోగ్య సిబ్బంది సహనంతో కూడిన సేవలు అందించాలని సూచించారు. తమ పరిధిలోని ప్రజల ఆరోగ్య వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలన్నారు. విధుల వివరాలను రికార్డు చేయాలని చెప్పారు. ఉప కేంద్రంలో అందుబాటులో ఉన్న, కొత్తగా వచ్చే మందుల వివరాలు, రోగులకు అందించే వాటిని విధిగా నమోదు చేయాలని చెప్పారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలలను ఆర్డీఓ తనిఖీ చేశారు. వసతులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు.